# నువ్వే నా ప్రాణం

## -ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి కథ

''నిన్నే పెళ్లాడుతా'' అన్నాడు రవి చిలిపిగా శపథం చేస్తున్నట్లు.

''నేను చచ్చినా చేసుకోను'' అంది కవిత కోపంగా.

కోపంతో మొహం ఎర్రబడిపోయింది. సంధ్య వెలుగులో అది మరింతగా మెరవసాగింది ఎర్రగా. పార్కులో కూర్చున్నారు ఇద్దరూ. చల్లని వాతావరణం. అయినా వేడెక్కిపోతోంది కవిత.

''ఛస్తే ఎలాగైనా చేసుకోలేవు'' అన్నాడు పాత జోకులేస్తూ.

''డొక్కు జోకులేయకు'' అంది చిరాగ్గా.

''ఈ పెళ్లి ఎలా జరుగుతుందో చూస్తాను'' అంది తనూ శపథం చేస్తున్నట్లు.

''అదేం. నువ్వెప్పుడూ పెళ్లి ఎలా జరుగుతుందో చూడలేదా?'' అన్నాడు ఆశ్చర్యం నటిస్తూ రవి.

''రవీ'' అంది గట్టిగా.

''అబ్బా! ఇక్కడే వున్నాగా కవీ''

మూతి ముడుచుకుని కోపంగా చూడసాగింది. నవ్వుతూ చూస్తున్నాడు రవి. ఒక చేతిమీద తల పెట్టుకుని గడ్డిలో పడుకుని విలాసంగా నవ్వుతూ చూస్తున్నాడు కవితని రవి. ఒక్క క్షణం మైమరచి అలాగే ఆ నవ్వును చూస్తుండిపోయింది. ఎంత అందగాడు. రవిని చేసుకోవడం కవితకెంతో ఇష్టం. అలాగే రవికి కూడా ఇష్టం. పైనుంచి వారి పెళ్లికి అడ్డంకులు లేవు. మేనరికం, చిన్నప్పట్నుంచీ ఇద్దరూ ఒకరి మాట ఒకరు వేదంలా పాటించుకుంటూ తిరిగేవారు.

''ఏమిట్రా ఆదర్శ దంపతుల్లా తిరుగుతున్నారు ఇప్పటినుంచే'' అని నవ్వేవారు అందరూ.

అయినా వాళ్లు లెక్క చేసేవారు కాదు. అలాంటిది కవిత అకస్మాత్తుగా రవిని పెళ్లి చేసుకోనని డిక్లేర్ చేసింది. ఎంత అడిగినా కారణం చెప్పలేదు. కవితని వదులుకోవడం రవికి కదా ఇష్టంలేదు. అందుకే సాధ్యమైనంతవరకు నవ్వులాటతోనే తీసివేయాలని ప్రయత్నం. ఆ ప్రయత్నమే ఈ పార్కులో మీటింగ్.

''పోనీ కారణం చెప్పు. ఆలోచిస్తాను'' అన్నాడు రవి ఒక్క ఛాన్సిస్తున్నట్లు చిలిపిగా.

రవిని తదేకంగా చూస్తున్న కవిత ఈ మాట వినగానే ఉలిక్కిపడింది. కారణం తను చెప్పినా ఎవరూ పట్టించుకోరు. అందుకే బ్లంట్‌గా చేసుకోనని మాత్రం చెబుతోంది. కానీ కవిత ఎంత ప్రతిఘటించినా లాభం లేకపోయింది. ఇరుప్రక్కలవారికి, రవికి అభ్యంతరం లేకపోవడంతో కవిత మాట పిల్లాటగా కొట్టి పారేసారు. పెళ్లయితే ఎలాగూ ఇష్టమే కాబట్టి తనే సర్దుకుంటుందని అనుకున్నారు. ఇద్దరికీ ఎంతో ఘనంగా పెళ్లిచేసారు. అయితే కవిత మనసంతా కసితో నిండిపోయింది. అతనంత పంతంగా పెళ్లి చేసుకోవడంతో తను వద్దన్న కారణం ప్రక్కకి తోసి అతనిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

ఆరోజు మొదటి రాత్రి. కవిత ఇష్టంతో ప్రమేయం లేకుండా అందాల బొమ్మలా అలంకరించారు. గదిలోకి తోసారు బలవంతంగా. తెల్లని పైజమా, సిల్కు లాల్చీలో ఎంతో అందంగా వున్నాడు రవి. అపరంజి బొమ్మలా కవితని ఆమె కళ్లల్లో వున్న కసిని చూసి మనసులో నవ్వుకున్నడు. ఆమెని గమనించనట్లు కొద్దిసేపు పేపరు చూసి లైటార్పి పడుకున్నాడు. హతాశురాలయింది కవిత. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. గదిలో ఇంటిమేట్ సెంటు వాసన, మల్లెల వాసన గుబాళిస్తూ ఇబ్బంది పెడుతున్నాయి.

కవిత క్రోధంతో మండిపోతూ అలాగే నిలబడింది. ఇంతలో సన్నటి గురక వినబడసాగింది. హతాశురాలయింది. బయటకి పోదామంటే గొళ్లెం వేసారు. మంచంమీద పడుకోవడం ఇష్టంలేక చాప వేసుకుని పడుకుంది,. కళ్లల్లో నీళ్లు కారసాగాయి. అలా ఎప్పుడు నిద్రపోయిందో తెలియదు. తలుపు చప్పుడు విని లేచింది. ఒక్క నిముషం అయోమయంలో పడింది. వెంటనే గుర్తుకు వచ్చింది. కానీ ఇదేమిటి తను క్రింద పడుకుంది కదా. మంచం మీదకు ఎలా వచ్చింది? తన నడుం చుట్టు వున్న రవి చెయ్యి తీసి తొందరగా తలుపు తీసింది. వదిన వరసవాళ్లని ఆడబడుచుల వరసవాళ్లని హాస్యాలు పట్టించుకోకుండా ముఖం కడుక్కోవడానికి వెళ్లింది.

> అరె! టైపిస్టుకు పెళ్లయిపోయిందా? పాపం అనవసరంగా తొందరపడ్డాను'' అనుకుంది కొంచెం పశ్చాత్తాపం లాంటిది కలగబోయింది. కానీ ఇంతసేపు తనుపడ్డ బాధ గుర్తుకొచ్చి అది బయటపడనీయలేదు.

రవి కవితని తీసుకుని కాపురానికి వెళ్లాడు. ఇదివరకు అతని బంధువులు, తమ బంధువులు వుండడంతో అతనికి సాధించడానికి వీలయ్యేదికాదు. ఇక్కడ తామిద్దరే కాబట్టి అతనిని వీలైనంతగా సాధించవచ్చు అనుకుంది. అనుకోవడం ఏమిటి వెంటనే ఆచరణలో కూడా పెట్టింది.

అతను ముందు గదిలో అనుకున్నవి మధ్యగదిలో, మధ్య గదిలో అన్నవి బెడ్‌రూమ్‌లో సర్దుతూ అతని అభిరుచులకి, తన అభిరుచులకి కూడా భిన్నంగా ఇంటిని అసహ్యంగా సర్దింది. అలాగే దొండకాయ అంటే కాకరకాయ, కాకరకాయ అంటే సొరకాయల్లా ఇద్దరికీ ఇష్టంలేనివి చేసేది. అయినా రవి ఏం అనేవాడు కాదు.

ఒకరోజు సాయంత్రం తొందరగా ఇంటికి వచ్చేసాడు రవి. చేతిలో పూలపొట్లం వుంది. పక్కింటి పిల్లకు జడవేస్తున్న కవిత చూడనట్లు ఊరుకుంది.

''కవీ! తొందరగా తయారవ్వాలి. నీకిష్టమైన జాకీచాన్ పిక్చర్. ఇవాళే ఆఖరిరోజు. టిక్కెట్లు తెచ్చాను'' అంటూ స్నానానికి వెళ్లిపోయాడు. పూలపొట్లం కవిత వళ్లో పడేసాడు.

నుదురు చిట్లించింది కవిత. అలా మగవాళ్లని పిలిచినట్లు పిలవడం ఇష్టముండదు. అయినా అలాగే పిలుస్తాడు. వద్దన్నా వినడు. స్నానం చేసి వచ్చిన రవి తను తెచ్చిన దండ పక్కింటి పాప తల్లో పెడుతూ కవితని చూస్తూ ఒక్క నిముషం అలాగే వుండిపోయాడు.

తరువాత అది పట్టించుకోనట్లుగా ''ఇంకా అలాగే వున్నావేం. తొందరగా తయారవ్వు'' అన్నాడు.

ఒక్క నిముషం కవిత మనస్సు ఊగిసలాడింది. తను ఎన్నోసార్లు మిస్సయిన సినిమా అది టిక్కెట్లు దొరక్క. అయినా సాధించాలిగా. అందుకే అంది. ''నేను రాను''


''ఏం?'' అన్నాడు నవ్వుతూ.

''నీకనవసరం. నేను రాను'' అంది కోపంగా.

''సరే అయితే. పాపం మా టైపిస్టు ఎన్నిసార్లు అడిగిందో ఆ సినిమా మిస్సయ్యాను అని. ఒక్క టిక్కెట్టు ఎక్స్‌ట్రా వుంటే ఇవ్వమని. ఆమెకి ప్రాప్తం. అయితే ఇంట్లోనే వుంటున్నావుగా. భయంలేదులే. ఇంగ్లీషు సినిమా కాబట్టి తొందరగానే అయిపోతుంది. లేదంటే ఆ పాపని తోడుంచుకో'' అంటూ కొంటెగా నవ్వి పెళ్లి నాటి డ్రెస్ వేసుకుని శ్రద్ధగా తయారయి వెళ్లిపోయాడు.

నిలువునా మండిపోతూ నిలబడింది. తను ఎన్నోసార్లు మిస్సయిన సినిమా అది. ఒకసారి రానని అనగానే వెళ్లిపోవడమేనా? ఇంకోసారి అడగవచ్చుకదా? పైగా టైపిస్టు అడిగిందిట. అడక్కేం చేస్తుంది. అసలే అందగాడు. అందులో పెద్ద ఇంజనీరు. ఉక్రోషంతో కళ్లల్లో నీళ్లు కారుతుంటే సోఫాలో పడుకుంది లైటు వేసుకోకుండా. ఎప్పుడు నిద్రపట్టిందో తలుపు చప్పుడకి ఉలిక్కిపడి లేచింది. తలుపు తీయడానికి భయపడింది. ఊరి చివరి ఇల్లు.

''కవీ'' అన్న రవి పిలుపుతో ధైర్యంగా లేచి తలుపు తీసింది.



ఉబ్బి ఉన్న కవితని మొహం చూడనట్లు నటిస్తూ లోపలికి వచ్చాడు.

''లైటు వేసుకోలేదేం. నువ్వెంత ఆదా చేద్దామనుకున్నా మినిమమ్ కట్టాల్సిందే'' అంటూ లైటు వేసాడు.

కోపంగా మూతి ముడుచుకుని లోపలకు పోబోతున్న కవిత జడ పట్టుకుని లాగాడు.

''ఉండు. నన్ను ముట్టుకోకు. ఈ రోజే మీ నాన్నగారికి వ్రాస్తాను'' అంది జడ విడిపించుకుంటూ కోపంగా.

''ఏమని? నీ జడ పట్టుకున్నాననా?'' అన్నాడు నవ్వుతూ.

''సరే ఇంతకీ ఏమిటి నా అపరాధం.''

''నువ్వు నీ టైపిస్టుతో సినిమాకు వెళ్లావుగా'' అంది.

''అని ఎవరన్నారు?''

''నువ్వే అన్నావుగా ఎక్స్‌ట్రా టిక్కెట్ వుంటే ఇవ్వమని'' అంది.

''అంది. ఇచ్చేసాను. రెండునూ. ఆమెతో వెళ్తానని ఎప్పుడన్నాను. ఒకవేళ వెళ్లాలని కుతూహలపడ్డా వాళ్లాయన తంతాడు'' అన్నాడు నవ్వుతూ.

''అరె! టైపిస్టుకు పెళ్లయిపోయిందా? పాపం అనవసరంగా తొందరపడ్డాను'' అనుకుంది కొంచెం పశ్చాత్తాపం లాంటిది కలగబోయింది. కానీ ఇంతసేపు తనుపడ్డ బాధ గుర్తుకొచ్చి అది బయటపడనీయలేదు.

'''అన్నట్లు కవితా! రేపు మా కొలీగ్స్ భోజనానికి వస్తున్నారు. నీ పాక శాస్త్ర ప్రావీణ్యం అంతా చూపించి వంట చేయాలి'' అన్నాడు. మళ్లీ ఒక కొత్త ఆలోచన తళుక్కుమంది. తెల్లవారుఝామునే లేచి రకరకాల వంటలు చేసింది. ఇంకా వంటింట్లో ఏమో చేస్తున్న కవితని చూస్తూ ''ఇంకా అవలేదా కవీ'' అన్నాడు ద్వారబంధం పట్టుకుని నిలబడుతూ.

''వంట చేయడం అంటే ద్వారబంధాలు పట్టుకుని నించోడంకాదు'' అంది విసురుగా.

''ఈజిట్'' అంటూ చిలిపిగా ఏదో అనబోతుంటే ''రవిగారూ'' అన్న పిలుపు వినబడింది. కొలీగ్స్ వచ్చారు. కొద్దిసేపు కబుర్లతో గడిచింది.

''కవితా'' అన్నాడు ఏ రూపంలో వస్తుందోనని భయపడుతూ. గులాబీరంగు వెంకటగిరి జరీ చీరతో లేత గులాబీలా ఫ్రెష్‌గా కదిలి వచ్చిన కవితని చూసి మురిసిపోయాడు.

''నా మిసెస్. కవితా ఎమ్ఏ'' అన్నాడు గర్వంగా.

''వెరీ నైస్ కపుల్'' అన్నారు స్నేహితులు అభివందనగా చూస్తూ.

''భోజనానికి వస్తారా?'' అంది మర్యాదగా కవిత.

''అలాగే. లేవండి'' అన్నాడు రవి. డైనింగ్ టేబుల్ మీద నీటుగా అమర్చిన పదార్థాలు చూసి చాలా ఆనందించాడు.

ఇల్లంతా తన కోరికకు తగినట్లుగా సర్ది వుంది. తెల్లారగట్ల లేచి చేసింది ఆ ప్లేట్లే కాబోలు. కవిత వడ్డించింది.

ముద్ద నోట్లో పెట్టుకున్న రవి కెవ్వుమన్నాడు.

''ఏమయింది?'' అన్నారు స్నేహితులు.

''చాలా కారంగా లేవా?'' అన్నాడు ఆశ్చర్యంగా నీళ్లు తాగుతూ.

''లేవే. చాలా చక్కగా వున్నాయి'' అన్నారు వాళ్లు ఆశ్చర్యంగా.

''నేనేం చేసినా వారికి నచ్చదులెండి అన్నయ్యగారూ'' అంది కలివిడిగా మాట్లాడుతూ కవిత.

''ఓరీ చవటా'' అన్నట్లు చూసారు వాళ్లు. ఒకసారి తలెత్తి కవిత వంక చూసి తల దించుకున్నాడు. ఏ పదార్థమూ తినలేకపోయాడు. అన్నీ భయంకరంగా తయారుచేసింది. అయినా తప్పనిసరిగా కొంచెం ముట్టుకుని అన్నీ పారేసాడు.

''ఇదేమిట్రా నీకవి నచ్చలేదా?'' అన్నారు వాళ్లు.

''లేదురా. కొంచెం జ్వరం తగిలినట్లు వుంది'' అన్నాడు. వారు నమ్మినట్లు కనబడలేదు.

''థాంక్స్ కవితగారు. మీ ఆతిధ్యం మరచిపోలేము. హోటల్లో వంట బోరు కొట్టినప్పుడుడల్లా మీ ఇంటికి వచ్చేస్తాము'' అన్నారు బెదిరిస్తున్నట్లుగా.


''తప్పకుండా'' అంది ముత్యాల పంటి వరుస కనబడేలా

నవ్వుతూ.

''కానీ మీ ఫ్రెండ్ ఏమీ తినలేదు పాపం'' అంది. అతను తిననందుకు కవితకి కొంచెం బాధగానే వుంది.

''పెరటి చెట్టు సామెత వుందిగా'' అన్నారు వాళ్లు కొంచెం చనువుగా.

రవి మొహం ఇంకా గంభీరంగా మారింది. కవిత చేసిన పని అర్థమయింది. కానీ స్నేహితుల ముందు బయటపడడం ఇష్టంలేక మౌనంగా వుండిపోయాడు.




రవి స్వభావానికి విరుద్ధంగా చాలా మౌనంగా వుంటున్నాడు. కవితతో చాలా ముక్తసరిగా అవసరానికి తగినంత మాట్లాడుతున్నాడు. కవిత చాలా బాధపడసాగింది. అతన్ని మామూలుగా చేయడానికి ప్రయత్నించింది. కానీ అతనిలో చలనం లేదు. ఆ రోజు జరిగిన దానికి కవిత కూడా చాలా బాధపడింది. కానీ రవి ఇంత సీరియస్‌గా తీసుకుంటాడని అనుకోలేదు.

ఒకరోజు రవి కొలీగ్ భార్య వకుళ వచ్చింది. రవికి దూరపు చుట్టం కూడా ఆమె. అక్క వరుస అవుతుంది. కానీ స్నేహమే ఎక్కువ. వున్నది మొహంమీదే అంటుంది. కానీ చాలా మంచిమనిషి. మనిషి వికారంగా వుంటుందని భర్తకి ఆమెపై నిరసన. వకుళ రాకతో కొద్దిగా రిలీఫ్‌గా ఫీలయింది కవిత.

తను మాట్లాడినా మాట్లాడకపోయినా ఎప్పుడూ ఏదో నవ్వుతూ నవ్విస్తూ వుండే రవి నిశ్శబ్దంగా అయిపోవడం, వేరే స్నేహితులు తనకి లేకపోవడంతో చాలా విసుగ్గా వుంటోంది. రవికి తను జాబ్ చేయటం ఇష్టంలేదు.

''అమ్మయ్య బోరు కొట్టి చస్తున్నాను. మీరు వచ్చారు. ఏమిటి విశేషాలు?'' అంది.

కొంచెంసేపు వకుళ ముభావంగా వుంది,. అది ఆమె స్వభావానికి విరుద్ధం.

''ఏమిటి అలా వున్నారు?'' అంది సంకోచిస్తూ కవిత.

''నేనొక విషయం చెబుతాను. ఏమీ అనుకోరుగా'' అంది. తల అడ్డంగా ఊపింది.

''అన్నయ్యగారు మిమ్మల్ని సరిగా చూడరట కదా'' అంది.

''ఎవరన్నారు?'' ఉలిక్కిపడింది.

''మావారన్నారు. ఏదో అందం చందంలేని నాలాంటి దాన్ని సరిగ్గా చూడకపోతే అర్థం వుంది. అన్నీ వున్న మిమ్మల్నే అలా చూస్తున్నారంటే ఏమనుకోవాలి ఈ మగవాళ్లని'' అంది నిట్టూరుస్తూ.

''ఎవరు చెప్పారు అలా మీకు? నేనంటే రవికి ప్రాణం'' అంది కోపంగా.

''చెప్పానుగా. మావారూ అన్నారు. ఆఫీసుల్లో అందరూ అలా అనుకుంటున్నారుట. మీరేది చేసినా వారికి నచ్చదుట. మీవారి స్నేహితులు వచ్చినప్పుడు ఆ మాట మీరే అన్నారట కూడా. అయినా అన్నయ్యగారిని చూస్తే అలా అనిపించరే? ఒకవేళ అలాంటివేమన్నా ఉన్నా నలుగురితో మీరు చెప్పుకోవచ్చా? ఇప్పుడు చూడండి. ఇద్దరూ చులకనైపోయారు. అంతా తీసి పడేస్తున్నా నేనే ఎప్పుడూ మావారి గురించి చెడుగా చెప్పను'' అంది చనువుగా కోప్పడుతూ వకుళ. తరువాత కొద్దిసేపు ఓదార్చి వెళ్లిపోయింది.

వకుళ చెప్పేది బుర్రకెక్కడం మానేసింది. వకుళ చెప్పేది నిజమా? తమ గురించి అందరూ అలా అనుకుంటున్నారా? అందుకే కాబోలు రవి అలా ఉంటున్నాడు. నిజంగా తనెంత పిచ్చి పని చేసింది. రవి కాబట్టి ఒక్క మాట అనకుండా తనలో తానే బాధపడుతున్నాడు. అదే వేరొకరైతే ఎంత గొడవ చేసేవారో. నిజంగా రవి ఎంత మంచివాడో! తనెంత పిచ్చిగా ప్రవర్తించినా ఏమీ అనడు. తనంటే ప్రాణం. తనే పిచ్చి పిచ్చి ఆలోచనలతో పనులతో అతని మనస్సు విరిచేసి అవమానపాలుచేసింది. పాపం ఆఫీసులో అతనే అవన్నీ ఎదుర్కోవాలి. తను మాత్రం ఇంట్లో హాయిగా తిని కూర్చుంటుంది.

కవిత కళ్ల వెంట నీళ్లు కారసాగాయి. దేవుడిచ్చిన వరాన్ని గుర్తించక మూర్ఖత్వంతో చెడగొట్టుకుంటోంది. పశ్చాత్తాపం నిండిన మనస్సుతో రవికి క్షమాపణలు చెప్పి ఇకముందు సరిగా నడుచుకోవాలని నిర్ణయించుకుంది. ఈ వక్కసారికి రవి క్షమిస్తే చాలనుకుంది. అతనికి ఇష్టమైన వంటకాలన్నీ చేసింది. అతనికి నచ్చిన చీర కట్టుకుని ఎదురు చూస్తూ కూర్చుంది.

రవి వచ్చాడు. కవిత ఆనందంగా ఎదురువెళ్లి ఎన్నో సపర్యలు చేసింది. రవి ఎప్పటిలాగే నిర్లిప్తంగా వున్నాడు. అందంగా అలంకరించబడిన గదిచూసి కూడా ఏమీ అనకుండా తన మౌనాన పడుకున్నాడు. కవితకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అయినా అభిమానాన్ని చంపుకుని దగ్గరకు వెళ్లింది. మంచంమీద కూర్చుని ''రవీ'' అంది.

''ఊ'' అన్నాడు ముభావంగా.

కవితకి ఏడుపు ఆగలేదు.

''రవీ! నన్ను క్షమించు. ఆఫీసులో నీకు చాలా అవమానం జరిగింది నా మూలంగా'' అంటూ ఏడవసాగింది.

''పోనీలే. అవమానం జరిగింది నాకే కానీ నీకు కాదుగా. నిన్ను అందరూ మెచ్చుకుంటూనే వున్నారుగా'' అన్నాడు వ్యంగ్యంగా.

''రవీ! అలా మాట్లాడకు. నన్ను క్షమించు. సరదాకి చేసిన పని ఇలా అవుతుందని అనుకోలేదు.

''నీకు అన్నీ సరదాయే. జీవితమే సరదా అయిపోయింది. వద్దంటున్నా నీమీద ప్రేమ చంపుకోలేక నిన్ను చేసుకున్నందుకు బాగానే శిక్ష వేసావుగా'' అన్నాడు కోపంగా.

''రవీ! అలా మాట్లాడకు. నన్ను తిట్టు, కొట్టు. కానీ అలా మాట్లాడకు. చేసింది తప్పే. ఈ ఒక్కసారికి క్షమించు'' అని ఏడుస్తున్న కవితని చూస్తూ కొద్దిసేపు అలాగే వుండిపోయాడు. ఒక్క నిముషం ఆగి భుజంమీద చెయ్యి వేస్తూ ''కవీ! ఊరుకో. పోనీలే. జరిగింది మర్చిపో'' అన్నాడు. కవిత ఏడుపు ఆపలేదు.

''అన్నట్లు నీ భుజం మీద చెయ్యి వేసాను మరి. నాన్నగారికి రాస్తావా?'' అన్నాడు భయం నటిస్తూ.

కవితకి అంత ఏడుపులోనూ నవ్వు వచ్చింది. ''ఛీ పో'' అంది.

''అయితే ఏమిటీ అలంకరణ అంతా. మన మొదటి రాత్రి ఇదేనా?'' అన్నాడు.

కవిత మొహం ఎర్రబడింది.

''ఇక ఏడుపు ఆపకపోతే నేను నిద్రపోతాను మరి'' కవిత తలెత్తింది. ''గుడ్'' అన్నాడు.

''అయితే కవితా. ఒక సందేహం. నేనంటే నీకు ఇష్టం లేదా నిజంగా? లేక ఎవరినైనా ప్రేమించావా?'' అన్నాడు సందేహంగా.

''ఛో! నువ్వంటే ఇష్టం లేకపోవడమేమిటి? నువ్వంటే ప్రాణం'' అంది గారంగా.

''మరి ఎందుకు వద్దన్నావు?''

''మరేం లేదు. అందరూ అంటారుగా మేనరికాలు మంచివికావని. మా రమ కూడా అంది. అందుకనే మనస్సు చంపుకుని నిన్ను చేసుకోనని అన్నాను'' అంది సణుగుతూ.

రవి ఆలోచిస్తూ వుండిపోయాడు కొద్దిసేపు. ఏదో అనబోయాడు. ఇంతలో కవిత అంది.

''కానీ ఒక్కటే బాధ. నా మూలంగా ఆఫీసులో నీకు అవమానం జరిగింది'' అంది బాధగా.

''అవమానం లేదు. ఏ మానంలేదు. అదంతా కట్టుకథ. వకుళ నాకు సాయం చేసింది'' అన్నాడు నవ్వుతూ.

''యూ'' అంటూ కొట్టబోతున్న కవిత చెయ్యి పట్టుకుని ఆపి లైటార్పేసాడు రవి.

★

## షీబా పెళ్లి



సెక్సీ తారగా పేరుతెచ్చుకున్న షీబాకి ఆ తరువాత అంతగా సినిమా ఛాన్సులు రాలేదు. తనే పాడుతూ ప్రయివేట్‌గా వీడియో ఆల్బమ్‌లను విడుదల చేసిన షీబాకి అక్కడ బాగానే కలిసివచ్చింది. ఆ వీడియో ఆల్బమ్‌లకి దర్శకత్వం వహించిన ఆకాష్ అంటే షీబా బాగా మోజు పడుతోందని పెళ్లి కూడా చేసుకుంటుందని తెగ వార్తలు వచ్చాయి ఆమధ్య. ఇప్పుడా వార్తల్ని నిజం చేస్తూ షీబా-ఆకాష్ పెళ్లిచేసేసుకున్నారు. పెళ్లి తరువాత కూడా తన యాక్టివిటీస్‌ని మానేయనంటోంది షీబా. సినిమాలుంటే సినిమాలు లేకపోతే ఆల్బమ్‌లు అంటోంది. ఏదేమైనా మొత్తానికి ఒక ఇల్లాలయింది షీబా.

- బీవీజె